సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

శనివారం | 7 | జనవరి | 2023



వైభవంగా చండీ హోమం


పెద్దాపురం: పెద్దాపురం మరిడమ్మ అమ్మవారికి శుక్రవారం చండీ హోమంతో పాటు బంగారు పుష్పాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.

పీక నులిమి చంపేశారు



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని నియోజకవర్గ కేంద్ర మైన మండపేటలో ఫొటోగ్రాఫర్‌ను పీక నులిమి చంపేశారు. నూతన సంవత్సర వేడుకల వేళ మండపేట బైపాస్ రోడ్డులోని ఒక లే అవుట్‌లో ఆ ఫొటోగ్రాఫర్ అనుమానాస్పద రీతిలో మృతి చెందిన విషయం తెలిసిందే. పోలీసులు కూడా అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. - IIలో

డెల్టాలకు నీరు విడుదల



రాజమహేంద్రవరం రూరల్: ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ నుంచి శుక్రవారం డెల్టా కాలువలకు 8,970 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 2,650, మధ్యడెల్టాకు 1,720, పశ్చిమ డెల్టాకు 4,600 క్యూసెక్కులు వదిలారు. బ్యారేజీ వద్ద నీటి మట్టం 8.60 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

ప్రముఖ న్యాయవాది 'పొన్నాడ' కన్నుమూత



పొన్నాడ హనుమంతరావు

రాజోలు: ప్రముఖ న్యాయవాది, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, రాజోలు మాజీ సర్పంచ్ పొన్నాడ హనుమంతరావు (83) అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో కన్ను మూశారు. కొంతకాలంగా ఆయన అక్కడే కుమారుడు సూర్యప్రకాష్ వద్ద ఉంటున్నారు. అరవై ఏళ్ల పాటు న్యాయవాద వృత్తిలో సేవలందించిన ఆయన అనేక చట్టాలను సామాన్యులకు అర్థమయ్యే రీతిలో తెలుగులో అనువాదం చేశారు. ఆయన తెలుగులో అనువదించిన 'న్యాయవిజ్ఞాన దర్శిని' పుస్తకాన్ని తెలుగు అకాడమీ ప్రచురించింది. హనుమంతరావు తండ్రి సూర్యారావు స్వాతంత్రోద్యమంలో పాల్గొన్న సమయంలో మహాత్మా గాంధీ రాజోలు వచ్చి, వారి ఇంట బస చేశారు. అప్పటి నుంచీ ఆ ఇంటికి గాంధీహౌస్‌గా పేరు పెట్టిన హనుమంతరావు, గాంధీజీ జ్ఞాపకాలను భావితరాలకు అందించారు. మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ, మాజీ ముఖ్యమంత్రులు వైఎస్ రాజశేఖరరెడ్డి, కె.రోశయ్య, ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తదితర ఎందరో ప్రముఖులు గాంధీహౌస్‌ను సందర్శించారు. కాంగ్రెస్ పార్టీకి అత్యంత విధేయుడిగా ఉంటూ రాజోలు నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థిగా ఆయన పోటీ చేశారు. రాజోలు సర్పంచ్‌గా పలు కాలనీల్లో ఇళ్ల స్థలాలను ఉచితంగా అందజేశారు. ఆయన రాసిన 'నూరు వసంతాల రాజోలు' పుస్తకం ఎంతో ప్రాచుర్యం పొందింది. హనుమంతరావు మృతికి రాష్ట్ర మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణు గోపాలకృష్ణ, ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు తదితరులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. హనుమంతరావు మృతదేహాన్ని హైదరాబాద్ నుంచి రాజోలు తీసుకువస్తున్నారు. ఇక్కడి గాంధీహౌస్ వద్ద శనివారం ప్రజల సందర్శనార్థం ఉంచి, రాజోలు వశిష్ట తీరంలో అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

డ్రోన్ ప్రారంభం



డ్రోన్‌ను ప్రారంభిస్తున్న డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు, కలెక్టర్ హిమాన్షు శుక్లా

సాక్షి అమలాపురం: అల్లవరం మండలం దేవగుప్తం పీఏసీఎస్ ఆధ్వర్యాన రూ.9 లక్షలతో కొనుగోలు చేసిన స్ప్రేయింగ్ డ్రోన్‌ను డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు, కలెక్టర్ హిమాన్షు శుక్లా శుక్రవారం ప్రారంభించారు. ఏపీ స్టేట్ అగ్రికల్చర్ మిషన్ సభ్యుడు, పీఏసీఎస్ అధ్యక్షుడు జిన్నూరి రామారావు (బాబీ) ఆధ్వర్యాన జరిగిన ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ, కూలీల కొరత అధిగమించేందుకు డ్రోన్లు ఎంతో ఉపయోగపడతాయన్నారు. విత్తనాలు వెదజల్లేందుకు కూడా డ్రోన్ ఉపయోగపడుతుందని, సెన్సార్ ఆధారంగా ఏ మోతాదులో ఎంత ఎత్తులో స్ప్రే చేయాలో డ్రోన్ నిర్దేశిస్తుందని చెప్పారు.

ఊబలంక పీహెచ్‌సీలో విజిలెన్స్ తనిఖీలు

రావులపాలెం: ఊబలంక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పీహెచ్‌సీ)లో రాజమహేంద్రవరం విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శుక్రవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఎస్పీ రవికుమార్ ఆదేశాలతో సీఐ రమేష్, ఏఈ భార్గవ మహేష్ తదితరులు ఆసుపత్రి రికార్డులు పరిశీలించారు. మౌలిక వసతులు, తాగునీటి లభ్యత, పరిసరాల పరిశుభ్రత, రోగులకు అందుతున్న వైద్య సేవలు, మందుల లభ్యత తదితర అంశాలను పరిశీలించారు. వీటిపై ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనున్నట్టు ఎస్పీ రవికుమార్ తెలిపారు.

బాలబాలాజీ ఆలయంలో టెండర్ల స్వీకరణ

మామిడికుదురు: అప్పనపల్లి శ్రీ బాలబాలాజీ స్వామి ఆలయంలోని పలు విభాగాలకు శుక్రవారం సీల్డు టెండర్లు స్వీకరించారు. పెళ్లి మంటపాలు, భక్తులు సమర్పించిన బియ్యం తీసుకు వెళ్లడం, వంట చెరకు, స్వామి, అమ్మవార్లకు అలంకరించిన పువ్వులు, పూల దండలతో అగరుబత్తీలు, ధూప్ కడ్డీలు తయారు చేయడం, నిత్యం హోమం నుంచి సేకరించిన భస్మంతో విబూది తయారు చేసి విక్రయించే లైసెన్సు హక్కులకు సీల్డు టెండర్లు స్వీకరించారు. అమలాపురం ఎండోమెంట్స్ తనిఖీదారు జె.రామలింగేశ్వరరావు, గ్రూప్ దేవాలయాల ఈఓ బొక్కా వెంకటేశ్వరరావు, ఆలయ ఈఓ ఎంకేటీ నాగవరప్రసాద్, ధర్మకర్తల మండలి చైర్మన్ చిట్టూరి రామకృష్ణ పర్యవేక్షణలో వీటిని స్వీకరించారు.

రైతుకు రుణయోగం

- పెరిగిన పెట్టుబడులకు అనుగుణంగా రుణ పరపతి పెంచుతూ నిర్ణయం
- గత ఏడాది కన్నా 15 శాతం అదనం
- కొన్ని పంటలకు మరింతగా..
- మూడు పంటల ప్రోత్సాహమే లక్ష్యంగా డీఎల్‌టీసీ నిర్ణయాలు

పంట రకం	పెంచిన స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ (రూ.లలో)
వరి (ఖరీఫ్)	36,000 – 43,000
వరి (రబీ)	40,000 – 46,000
మొక్కజొన్న	32,000 – 38,000
పెసలు, మినుములు	13,000 – 15,500
చెరకు	75,000 – 80,900
అరటి	75,000 – 85,000
అరటి టిష్యూ కల్చర్	1,03,000 – 1,06,000
కొబ్బరి	25,000 – 40,000
కొబ్బరిలో అంతర పంటలకు అదనంగా	25,000
కోకో	35,000 – 44,000
కూరగాయలు	30,000 – 40,000
కంద	1,16,000 – 1,22,000
పండుగప్ప	3,75,000
స్కాంపీ రొయ్యలు	82,000
వెనామీ రొయ్యలు	6,25,000
పీత	1,00,000
చేప	1,25,000
తిలాపీయా	75,000
పాడి ఆవుకు	8,000 – 10,000
గేదెకు	10,000 – 11,000

సాక్షి అమలాపురం: గోదావరి డెల్టాలో వరి రైతులకు దన్నుగా నిలుస్తూనే మూడో పంట సాగు చేసేలా.. ఉద్యాన రైతులకు వెన్నుదన్నుగా ఉంటూనే వారి ఆదాయం పెంచేందుకు అంతర పంటలను ప్రోత్సాహించేలా.. ఆక్వా సాగుకు రుణ పరపతి పెంచుతూనే కొత్తగా పీతల సాగుకు ఊతమిచ్చేలా.. పాడికి వెన్నుదన్నుగా నిలుస్తూనే పాడి పశువుల సంఖ్య పెరిగేలా.. జిల్లా స్థాయి సాంకేతిక కమిటీ (డీఎల్‌టీసీ) నిర్ణయాలు తీసుకుంది. గోదావరి డెల్టాలో రైతుకు దన్నుగా నిలిచేలా ఆయా పంటల సాగుకు.. పెంపకానికయ్యే పెట్టుబడిలో మూడు వంతులకు పైగా రుణం ఇచ్చేలా చర్యలు తీసుకుంది.

కొత్త జిల్లా ఏర్పడిన తరువాత డీఎల్‌టీసీ సమావేశం డీసీసీబీ సీఈఓ నరసింహరాజు అధ్యక్షతన తొలిసారిగా శుక్రవారం జరిగింది. జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) చైర్మన్ ఆకుల వీర్రాజు, కలెక్టర్ హిమాన్షు శుక్లా ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. 2023–24 సంవత్సరంలో వ్యవసాయ, ఉద్యాన, పాడి, మత్స్యశాఖల పరిధిలో పంటలకు, పశువుల పెంపకానికి సంబంధించిన రుణ పరిమితిని ఈ సమావేశంలో నిర్ధారించారు. పెరిగిన ఎరువులు, డీజిల్, కూలి రేట్లను పరిగణనలోకి తీసుకుని, అన్ని పంటలకూ 15 శాతం వరకూ పెంచాలని నిర్ణయించారు. అంతర పంటలు, పీతల వంటి పంటలకు ఇచ్చే రుణ పరిమితి మరింత పెంచారు.



డీఎల్‌టీసీ సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు

మూడో పంటకు ఊతం

వరి పంటకు గత ఏడాది కన్నా రుణ పరపతి తగ్గించాలని అధికారులు ప్రతిపాదించగా కలెక్టర్ శుక్లా, ఏపీ స్టేట్ అగ్రి మిషన్ సభ్యుడు జిన్నూరి రామారావు (బాబి) అభ్యంతరం తెలిపారు. ఖర్చులు పెరిగినందున పెట్టుబడి కూడా పెరిగిందని, అదనంగా పెంచాల్సిందేనని స్పష్టం చేశారు. ముందస్తు ఖరీఫ్, రబీ వల్ల ఈ ఏడాది మూడో పంట సాగు చేసే అకాశముందని, దీనిని ప్రోత్సహించాలని కలెక్టర్ సూచించారు. మినుము, పెసలతో పాటు మెరక చేలల్లో కూరగాయ పంటలను ప్రోత్సహించాలన్నారు. పీతల సాగు పెంచేందుకు కూడా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయా పంటలకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ పెంచాలని సూచించారు. కొబ్బరిలో అంతర పంటలు పెంచేలా చర్యలు తీసుకోవాలని, వాటికి సైతం రుణ పరిమితి పెంచుతున్నామని చెప్పారు. డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు మాట్లాడుతూ, అన్ని పంట రుణాలను ఆయా శాఖల అధికారులు ప్రతిపాదించిన విధంగా పెంచేందుకు చర్యలు తీసుకున్నామని తెలిపారు. జిన్నూరి బాబీ మాట్లాడుతూ కోనసీమలో వెదురు సాగును ప్రోత్సహించాలన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబు, వ్యవసాయ, ఉద్యాన, మత్స్య, పశు సంవర్ధక శాఖల జిల్లా అధికారులు కె.నాగేశ్వరరావు, ఎస్.మల్లికార్జునరావు, అహ్మద్, ఎ.జైపాల్ పాల్గొన్నారు.

శుచిగా.. రుచిగా..



అమలాపురం ఏరియా ఆసుపత్రి

- ప్రభుత్వాసుపత్రుల్లో మరింత నాణ్యమైన ఆహారం
- ఇటీవల డైట్ చార్జీలు పెంచిన ప్రభుత్వం
- పెంచిన చార్జీలతో తాజా టెండర్లకు ఏర్పాట్లు

పెంచిన డైట్ చార్జీలు (రూ.లలో) ఇలా..

కేటగిరీ	ప్రస్తుతం	పెంచిన ధరతో
ఇన్‌పేషెంట్లు	40	80
టీబీ, మానసిక రోగులు	56	80
డ్యూటీ డాక్టర్లు	80	100

అమలాపురం టౌన్: జిల్లాలోని రెండు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రులు, 9 కమ్యూనిటీ హెల్త్ సెంటర్ల(సీహెచ్‌సీ)లో రోగులకు మరింత నాణ్యమైన ఆహారం అందించేందుకు వైద్య విధాన పరిషత్ జిల్లా అధికారులు చర్యలు చేపడుతున్నారు. జిల్లాలోని అమలాపురం, రామచంద్రపురం పట్టణాల్లో ఏరియా ఆసుపత్రులున్నాయి. కొత్తపేట, రాజోలు, ముమ్మిడివరం, టి.కొత్తపల్లి, ఆలమూరు, కపిలేశ్వరపురం, అల్లవరం, పి.గన్నవరం, మండపేటల్లో సీహెచ్‌సీలు ఉన్నాయి. వీటిల్లోని రోగులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనాలను రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా అందిస్తోంది. గత సంవత్సరానికి సంబంధించిన డైట్ చార్జీల పెండింగ్ బిల్లులను ప్రస్తుత కాంట్రాక్టర్లకు ప్రభుత్వం ఇటీవల చెల్లించింది. అల్పాహారం, భోజన చార్జీలను రూ.40 నుంచి ఒకేసారి రూ.80కి పెంచింది. ఇన్ పేషెంట్లు, టీబీ, మానసిక రోగులు, డ్యూటీ డాక్టర్లకు పెట్టే డైట్ చార్జీలు మాత్రమే పెంచారు. గర్భిణులు, బాలింతలకు పెట్టే పౌష్టికాహార చార్జీ ఇప్పటికే రూ.100 ఉంది. పెంచిన ధరలకు అనుగుణంగా కొత్త కాంట్రాక్టు కోసం తాజాగా టెండర్ల నిర్వహణకు జిల్లా ప్రభుత్వాసుపత్రుల సమన్వయకర్త డాక్టర్ పి.పద్మశ్రీరాణి ఆధ్వర్యాన అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లా డైట్ మేనేజ్‌మెంట్ కమిటీ (డీడీఎంసీ) కూడా టెండర్ల ప్రక్రియను పర్యవేక్షిస్తోంది.

ఇవీ టెండర్ల నిబంధనలు

- ప్రభుత్వాసుపత్రుల్లోని రోగులకు అల్పాహారం, భోజనాలు సరఫరా చేసే కాంట్రాక్ట్ రెండేళ్ల కాల పరిమితితో ఉంటుంది.
- సీల్డ్ కవర్ల విధానంలో టెండర్లు వేయాలి.
- కాంట్రాక్టర్లు, సంస్థలు ఈ నెల 9 నుంచి 23వ తేదీ వరకూ ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల లోపు కార్యాలయం పని చేసే రోజుల్లో టెండర్ పత్రాలు పొందాలి.
- పూర్తి చేసిన టెండర్లను ఈ నెల 24వ తేదీ సాయంత్రం 3 గంటల్లోపు జిల్లా జాయింట్ కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలోని ప్రభుత్వాసుపత్రుల సమన్వయకర్త (డీసీహెచ్ఎస్) కార్యాలయంలో అందజేయాలి.
- 'డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్ ఆఫ్ హాస్పిటల్ సర్వీస్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా, అమలాపురం' పేరిట అమలాపురంలో చెల్లుబాటయ్యేలా ఏదైనా జాతీయ బ్యాంక్‌లో రూ.1,500 డీడీ తీసి, టెండర్ ఫారం పొందాలి.

అన్నదాతకు ప్రభుత్వ దన్ను

- ధాన్యం కొనుగోళ్లలో దళారుల జోక్యానికి చెక్
- రైతులకు మేలు చేసిన నూతన విధానం
- దక్కుతున్న పూర్తి మద్దతు ధర
- గడువుకంటే ముందే సొమ్ములు



మిల్లుకు తరలించేందుకు ధాన్యాన్ని సిద్ధం చేస్తున్న రైతులు (ఫైల్)

మండపేట: ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన నూతన విధానం దళారుల జోక్యానికి పూర్తి స్థాయిలో అడ్డుకట్ట వేసింది. దీనిపై అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతంలోనూ ప్రభుత్వమే ధాన్యం కొనుగోళ్లు చేసేది. అయితే రైతులు తమకు తెలిసిన కమీషన్ ఏజెంట్లు, మిల్లర్ల వద్దకు ధాన్యం తీసుకువెళ్లేవారు. ఇది దళారుల జోక్యానికి వీలు కల్పించేది. కొనుగోలు కేంద్రంలో నిర్ధారించిన తేమ శాతం సరిగా లేదనో.. ఎక్కువ ఉందనో.. తాలుగింజలు ఎక్కువగా ఉన్నాయనో.. ఇలా రకరకాల కారణాలతో ఆ దళారులు ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేసేవారు కాదు. మద్దతు ధరలో ప్రతి బస్తాకు రూ.50 నుంచి రూ.100 వరకూ కోత పెట్టేవారు. తద్వారా ఆయా రైతులు ఎకరాకు రూ.2,400 నుంచి రూ.3,300 వరకూ నష్టపోయేవారు. దీనికితోడు ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో రైతుల ఆందోళనను ఆసరా చేసుకుని దళారులు ధర మరింతగా తగ్గించేసేవారు. దీంతో అధిక శాతం రైతులు ఏం చేయాలో పాలుపోక అయినకాడికి అమ్ముకోవాల్సిన దుస్థితి ఎదుర్కొనేవారు. రైతుకు, దళారీకి మధ్య ముందుగా కుదిరిన ఒప్పందం మేరకు ధాన్యం బస్తాలను తగ్గించి, మిగిలిన వాటిని కొనుగోలు కేంద్రంలో ఆన్‌లైన్ చేయించేవారు. ఆన్‌లైన్ అయిన ధాన్యానికి మాత్రమే ప్రభుత్వం సొమ్ములు చెల్లించేది. తగ్గించిన బస్తాల సొమ్ము దళారుల పాలై పూర్తి మద్దతు ధర అందక రైతులు నష్టపోయేవారు.


తప్పిన దళారుల బెడద

రైతుల కష్టం దళారుల పాలవ్వకుండా, ఏ దశలోనూ వారి జోక్యానికి ఆస్కారం లేకుండా ప్రభుత్వం ఈసారి కొనుగోలు నిబంధనలను కట్టుదిట్టం చేసింది. కొత్త నిబంధనల మేరకు సొసైటీకి రైతు ధాన్యం శాంపిల్ తీసుకువెళ్తే చాలు.. అక్కడి కొనుగోలు సిబ్బంది తేమ శాతం నిర్ధారిస్తారు. ఈ–క్రాప్ నమోదుకు లోబడి ఎన్ని టన్నుల ధాన్యం పంపించేదీ ఆన్‌లైన్ చేయగానే ఏ మిల్లుకు తరలించాలో కంప్యూటర్ సూచిస్తుంది. ఆ మిల్లుకు మాత్రమే ధాన్యాన్ని తరలించాలి. అందుకయ్యే రవాణా ఖర్చులను ప్రభుత్వమే చెల్లిస్తోంది. తేమ శాతంపై అభ్యంతరాలుంటే సొసైటీ సిబ్బందే చూసుకుంటారు. రైతుకు ఎటువంటి సంబంధమూ ఉండదు. ఈ నూతన విధానంపై మొదట్లో అవగాహన లేక కొంత గందరగోళం నెలకొన్నప్పటికీ.. పండించిన ధాన్యానికి పూర్తి మద్దతు ధర దక్కడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఎకరాకు సగటున 33 బస్తాల దిగుబడి వస్తుండగా, వివిధ సాకులతో రూ.3,300 వరకూ ఆదాయం కోల్పోయేవారమని, ఇప్పుడు పూర్తి మద్దతు ధర దక్కుతోందని, గతంలో కోల్పోయిన సొమ్ము ఈసారి ఆదా అవుతోందని వారు చెబుతున్నారు.

రైతులకు రూ.420 కోట్ల చెల్లింపు

- జిల్లాలో ఖరీఫ్ వరి సాగు విస్తీర్ణం : 1,39,000 ఎకరాలు
- ధాన్యం దిగుబడి అంచనా : 3,09,000 మెట్రిక్ టన్నులు
- స్థానిక వినియోగం అంచనా : 30,867 మెట్రిక్ టన్నులు
- ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలు : 331
- ఇప్పటి వరకూ కొనుగోలు చేసిన ధాన్యం : 2,31,000 మెట్రిక్ టన్నులు
- దాని విలువ : రూ.471.6 కోట్లు
- రైతులకు చెల్లించినది : రూ. 420.7 కోట్లు


కొత్త విధానం మేలు చేసింది



ధాన్యం కొనుగోళ్లలో కొత్త విధానం మాకు ఎంతో మేలు చేసింది. మునుపు ఏదో ఒక కారణంతో బస్తాకు ఎంతోకంత కోత పెట్టేవారు. ఇప్పుడు ఆన్‌లైన్‌లో పూర్తి మద్దతు ధర అందడంతో ఎకరాకు రూ.2,500 పైగా అదనపు ఆదాయం కనిపిస్తోంది.

– చల్లా సూర్యనారాయణ, రైతు, కేశవరం


చాలా బాగుంది



ఈ సీజన్‌లో అమలు చేసిన నూతన విధానం చాలా బాగుంది. మద్దతు ధర మొత్తం రైతులకే దక్కింది. సొసైటీలకు చెల్లిస్తున్న కమీషన్ క్వింటాల్‌కు రూ.50కి పెంచాలని సివిల్ సప్లయిస్ ఉన్నతాధికారులను కోరుతున్నాం.

– తోట వెంకటరామయ్య, రాష్ట్ర కోశాధికారి, సొసైటీ ఉద్యోగుల సంఘం, ద్వారపూడి

రైతులకు పూర్తి న్యాయం



కొత్త విధానంలో దళారుల జోక్యానికి పూర్తిగా బ్రేక్ వేయడం వలన రైతులకు న్యాయం జరిగింది. 21 రోజుల వరకూ ఎదురు చూడకుండా రైతులకు ముందే ధాన్యం సొమ్ములు చెల్లిస్తున్నాం. రవాణ చార్జీలు చెల్లింపునకు చర్యలు తీసుకుంటున్నాం.

– కె.తులసి, జిల్లా సివిల్ సప్లయిస్ మేనేజర్

ఇదే ప్రాతిపదిక

- నామినల్ రోల్స్ డిజిటలైజేషన్
- పొరపాట్లకు తావివ్వొద్దన్న పరీక్షల విభాగం
- జిల్లాలో 20,968 మంది టెన్త్ విద్యార్థులు



రాయవరం: విద్యార్థి జీవితాన్ని మలుపు తిప్పేది.. వారి బంగారు భవిష్యత్తుకు బాట వేసేది పదో తరగతి. ఉన్నత చదువులు చదవాలన్నా.. ఏ ఉద్యోగానికి దరఖాస్తు చేసుకోవాలన్నా పదో తరగతి ఉత్తీర్ణత సర్టిఫికెట్‌నే ప్రాతిపదికగా తీసుకుంటారు. అందువలన విద్యార్థులకు ఇది ఎంతో కీలకమైనది. ఈ నేపథ్యంలో వారి సర్టిఫికెట్లలో పొరపాట్లు లేకుండా నామినల్ రోల్స్ రూపొందించాల్సి ఉంది. మరో మూడు నెలల్లో పదో తరగతి విద్యార్థులు పబ్లిక్ పరీక్షలు రాయనుండగా.. వారి నామినల్ రోల్స్ తయారు చేసే పనిలో ప్రధానోపాధ్యాయులు బిజీగా ఉన్నారు.

తప్పుల్లేకుండా..

టెన్త్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల వివరాలను ప్రధానోపాధ్యాయులు ఆన్‌లైన్‌లో ఇప్పటికే సమర్పించారు. విద్యార్థుల పేరు, వారి తల్లిదండ్రుల పేర్లు, కులం, ఆదాయ వివరాలు, నివాస ప్రాంతం, ఆధార్ కార్డు నంబరు తదితర వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. పరీక్ష ఫీజు కూడా చెల్లించారు. **విద్యార్థుల వివరాల నమోదులో ఏ చిన్న పొరపాటు జరిగినా అది వారి భావి జీవితానికి గ్రహపాటే అవుతుంది. అందుకే నామినల్ రోల్స్ విషయంలో ఏ చిన్న పొరపాటుకూ తావు లేకుండా** వ్యవహరించాలని ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ దేవానందరెడ్డి ఇప్పటికే ప్రధానోపాధ్యాయులకు ఆదేశాలు జారీ చేశారు. గతంలో ఆన్‌లైన్‌లో విద్యార్థుల నామినల్ రోల్స్ నమోదు చేసిన తరువాత ఆ వివరాల మాన్యువల్ కాపీని జిల్లా విద్యాశాఖ కార్యాలయాల్లో కూడా సమర్పించేవారు. ఈ విద్యా సంవత్సరం నుంచి మాన్యువల్ కాపీలు సమర్పించనవసరం లేదని ప్రభుత్వ పరీక్షల విభాగం ఆదేశాలు జారీ చేసింది.

జిల్లాలోని 374 ప్రభుత్వ, ప్రైవేటు ఉన్నత పాఠశాలల్లో 20,968 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయనున్నారు. వీరిలో 19,084 మంది రెగ్యులర్ కాగా, 1,883 మంది ప్రైవేటు విద్యార్థులున్నారు. ఇప్పటికే ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు విద్యార్థుల నుంచి పరీక్ష ఫీజు వసూలు చేసి, వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఇప్పటికీ పదో తరగతి పరీక్ష ఫీజు చెల్లించని వారు ఈ నెల 8వ తేదీలోగా రూ.500 అపరాధ రుసుంతో చెల్లించేందుకు గడువు ఉంది.

సవరణకు అవకాశం

ఆన్‌లైన్‌లో సమర్పించిన పదో తరగతి విద్యార్థుల నామినల్ రోల్స్‌లో ఏమైనా పొరపాట్లుంటే సరి చేసుకునేందుకు ప్రభుత్వ పరీక్షల విభాగం ఒక పర్యాయం ఎడిట్ ఆప్షన్ ఇవ్వనుంది. ఈ నెల 9వ తేదీ తర్వాత ఎడిట్ ఆప్షన్ ఇచ్చే అవకాశముంది. ఈ విషయాన్ని ప్రధానోపాధ్యాయులకు పత్రికాముఖంగా, సోషల్ మీడియా ద్వారా ముందుగా తెలియజేస్తారు. పొరపాట్లుంటే ప్రధానోపాధ్యాయులు ఆ సమయంలో సరి చేసుకునే అవకాశముంది.

తప్పులకు అవకాశం లేకుండా



ఆన్‌లైన్‌లో నామినల్ రోల్స్ సబ్‌మిట్ చేసే సమయంలో తప్పులకు అవకాశం లేకుండా చూడాలని ఇప్పటికే ప్రధానోపాధ్యాయులకు ఆదేశాలు జారీ చేశాం. ఒకటికి రెండుసార్లు వివరాలు సరి చూసుకోవాలని, తల్లిదండ్రుల నుంచి కూడా డిక్లరేషన్ తీసుకోవాల్సిందిగా హెచ్‌ఎంలకు సూచించాం. తప్పులకు అవకాశం లేని విధంగా నామినల్ రోల్స్ తయారు చేసేలా హెచ్‌ఎంలు చర్యలు తీసుకోవాలి.

– ఎన్‌వీ రవిసాగర్, జిల్లా విద్యాశాఖాధికారి

ఎన్‌హెచ్ పనులకు సహకరించాలి



జేసీ ధ్యానచంద్రతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాపాక

రాజోలు: జాతీయ రహదారి (ఎన్‌హెచ్) బైపాస్ నిర్మాణ పనులు పూర్తయ్యేందుకు రైతులు సహకరించాలని జాయింట్ కలెక్టర్ ధ్యానచంద్ర కోరారు. శివకోటి, పాలగుమ్మి గ్రామాలకు చెందిన జాతీయ రహదారి పరిహారం పొందే రైతులతో శుక్రవారం ఆయన సమావేశం నిర్వహించారు. జాతీయ రహదారికి భూమి ఇచ్చిన రైతులకు ప్రభుత్వ నిబంధనలకు లోబడి పరిహారం అందిస్తామని చెప్పారు. పరిహారం విషయంలో అపోహలు విడనాడాలని కోరారు. ఎన్‌హెచ్ నిర్మాణంలో భూమి కోల్పోయిన రైతులకు ఎటువంటి నష్టం కలగకుండా చూడాలని ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు జేసీని కోరారు. కార్యక్రమంలో రాజోలు, శివకోటి సర్పంచ్‌లు రేవు జ్యోతి, నక్కా రామారావు, తహసీల్దార్ బీఎం ముక్తేశ్వరరావు, ఎన్‌హెచ్ అధికారులు పాల్గొన్నారు.

పీక నులిమి చంపేశారు



మృతుడు కొనిజాల సురేష్ (ఫైల్)

- ఫొటోగ్రాఫర్ హత్య వెనుక 'దేశం' నేత హస్తం
- పరారీలో ప్రధాన అనుచరుడు
- రెండు ప్రత్యేక బృందాలతో గాలింపు
- హత్య కేసుగా నమోదు

సాక్షి ప్రతినిధి, కాకినాడ: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని నియోజకవర్గ కేంద్రమైన మండపేటలో ఫొటో గ్రాఫర్‌ను పీక నులిమి చంపేశారు. నూతన సంవత్సర వేడుకల వేళ మండపేట బైపాస్ రోడ్డులోని ఒక లే అవుట్‌లో ఆ ఫొటోగ్రాఫర్ అనుమానాస్పద రీతిలో మృతి చెందిన విషయం తెలిసిందే. పోలీసులు కూడా అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. తీరా తీగ లాగితే డొంక కదిలింది. అనుమానితులను పోలీసులు తమదైన శైలిలో విచారించారు. పోస్టుమార్టం నివేదికలో ఫొటోగ్రాఫర్‌ను హత్య చేసినట్టుగా నిర్ధారించారు. ఈ హత్య వెనుక పట్టణంలోని తెలుగుదేశం పార్టీకి చెందిన ఒక మాజీ ప్రజాప్రతినిధి హస్తం ఉన్నట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. కేసులో కీలక నిందితునిగా ఉన్న అతడి అనుచరుడు పరారీలో ఉండటం ఇందుకు బలం చేకూరుస్తోంది. అసలు ఈ హత్యకు, ఆ మాజీ ప్రజాప్రతినిధికి మధ్య సంబంధం ఏమిటి, హత్య చేయాల్సిన అవసరం ఏమొచ్చిందనే కోణంలో పోలీసు దర్యాప్తు సాగుతోంది.

మండపేటకు చెందిన ఫొటోగ్రాఫర్ కొనిజాల సురేష్ (28) డిసెంబర్ 31వ తేదీ రాత్రి నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొనేందుకు స్నేహితులతో కలిసి వెళ్లి శవమై తేలాడు. తొలుత పట్టణ పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. మృతదేహంపై ఉన్న గాయాల ఆధారంగా నాలుగు రోజులుగా వివిధ కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. మండపేట బైపాస్ రోడ్డులోని ఓ లే అవుట్‌లో ఆ రోజు నూతన సంవత్సర వేడుకలు జరిగాయి. ఇందులో పట్టణ టీడీపీకి చెందిన మాజీ ప్రజాప్రతినిధి కారు డ్రైవర్‌తో కలిసి సురేష్ పాల్గొన్నట్టు పోలీసులు గుర్తించారు. ఈ నేపథ్యంలో ఆ డ్రైవర్‌తో పాటు మరికొందరిని తమదైన శైలిలో విచారించి, సురేష్ హత్యకు గురైనట్టు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. ఈ హత్యతో సంబంధం ఉన్న మరికొందరు అనుమానితుల పేర్లను సేకరించారు. వారిలో సదరు మాజీ ప్రజాప్రతినిధి ప్రధాన అనురుడు కూడా ఉన్నాడని నిర్ధారించుకున్నారు. అతడితో పాటు మరికొందరు పరారీలో ఉండటంతో వారి కోసం రెండు ప్రత్యేక బృందాలతో గాలిస్తున్నారు.

హతుడు సురేష్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. అతడి కుటుంబ సభ్యులు ఆ మాజీ ప్రజాప్రతినిధి ఇంట్లో పని చేసేవారనే విషయం పోలీసుల దృష్టికి వచ్చింది. మాజీ ప్రజాప్రతినిధితో పాటు మరికొందరు అనుమానితుల పేర్లు విచారణలో పోలీసులకు చెప్పినట్టుగా హతుని సోదరుడు ఫోన్ సంభాషణ సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడం సంచలనమైంది. విచారణలో వచ్చిన సమాచారం ఆధారంగా పోలీసులు సీసీ టీవీ ఫుటేజీలు, అనుమానితుల కాల్‌డేటా వివరాలు సేకరించి పరిశీలిస్తున్నారు. హత్య విషయం వెలుగులోకి వచ్చినప్పటి నుంచీ రామచంద్రపురం డీఎస్పీ బాలచంద్రారెడ్డి మండపేట వచ్చి అనుమానితులను విచారిస్తున్నారు. జిల్లా ఎస్పీ సుధీర్‌కుమార్‌రెడ్డి కేసు పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. శుక్రవారం వచ్చిన పోస్టుమార్టం నివేదికలో సురేష్ మెడ భాగంలో ఎముకలు విరిగి ఉన్నట్టు నిర్ధారణ అయింది. దీంతో అనుమానాస్పద మృతి కేసును పోలీసులు హత్య కేసుగా మార్చారు. పరారీలో ఉన్న అనుమానితులు దొరికితే మాజీ ప్రజాప్రతినిధి పాత్రపై స్పష్టత వస్తుందని పోలీసులు అంటున్నారు. ఈ కేసును అన్ని కోణాల్లోనూ సమగ్రంగా విచారణ చేస్తున్నామని మండపేట టౌన్ సీఐ పి. శివగణేష్ చెప్పారు. కేసులోని ప్రధాన నిందితులను ఆధారాలతో సహా పట్టుకుంటామని అన్నారు.

హనీకి పింఛన్ అందజేత



హనీ తల్లిదండ్రులకు పింఛన్ అందజేస్తున్న కలెక్టర్ శుక్లా

సాక్షి అమలాపురం: అరుదైన గాకర్స్ వ్యాధితో బాధ పడుతున్న చిన్నారి హనీకి వైద్య భరోసాతో పాటు పింఛన్ ఊతం కూడా లభించింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నెలకు రూ.10 వేల చొప్పున పింఛన్ అందించాలని జిల్లా అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు తొలి పింఛన్‌ను అల్లవరం మండలం నక్కా రామేశ్వరానికి చెందిన హనీ తల్లిదండ్రులు కొప్పాడి రాంబాబు, నాగలక్ష్మి దంపతులకు కలెక్టర్ హిమాన్షు శుక్లా కలెక్టరేట్‌లో శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గంటి పెదపూడిలంక పర్యటన సందర్భంగా సీఎం జగన్ ఇచ్చిన హామీ మేరకు హనీ వైద్యం కోసం గతంలో రూ.కోటి కేటాయించారని తెలిపారు. ఇప్పుడు నెలకు రూ.10 వేల చొప్పున పింఛన్ అందజేస్తున్నామన్నారు. హనీకి స్థానిక ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో ఉచిత ప్రవేశం కల్పించి, అన్నివిధాలా సహాయం అందిస్తానని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ సీహెచ్ సత్తిబాబు, డీఆర్‌డీఏ పీడీ డీవీ శివశంకర్ ప్రసాద్, ఎంపీడీఓ సరోవర్, కొమరగిరిపట్నం సర్పంచ్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

యానాంపై వివక్ష వీడాలి

- సీఎం రంగసామికి డిమాండ్
- సమస్యలు పరిష్కారమయ్యే వరకూ నిరవధిక దీక్ష
- ఎమ్మెల్యే శ్రీనివాస్ అశోక్ స్పష్టీకరణ
- యానాంలో ఉద్రిక్తత.. పోలీసుల మోహరింపు



దీక్ష చేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్ అశోక్

యానాం: తన నియోజకవర్గంపై వివక్ష వీడాలని యానాం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ పుదుచ్చేరి ముఖ్యమంత్రి రంగసామిని డిమాండ్ చేశారు. గతంలో 15 ప్రజా సమస్యలతో ప్రభుత్వానికి ఇచ్చిన డిమాండ్లను నెరవేర్చాలనే కోరుతూ.. స్థానిక ప్రాంతీయ పరిపాలనాధికారి (ఆర్ఏఓ) కార్యాలయం సమీపాన 'ప్రజాగర్జన' పేరుతో ఆయన శుక్రవారం నిరవధిక నిరాహార దీక్ష ఆరంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అశోక్ మాట్లాడుతూ, యానాం అభివృద్ధిని, సంక్షేమాన్ని అడ్డుకుంటున్నారని, ఇక్కడి సమస్యలను పట్టించుకోవడం లేదనే ఆవేదనతో తాను నవంబర్ 7న పుదుచ్చేరి అసెంబ్లీ వద్ద నిరవధిక నిరాహార దీక్ష చేపట్టానని గుర్తు చేశారు. ఆ సందర్భంగా సీఎం రంగసామి తదితరులకు వినతిపత్రం ఇవ్వగా నెల రోజుల్లో ఆయా సమస్యలు పరిష్కరిస్తామంటూ హామీ ఇచ్చారని, అది ఇప్పటి వరకూ నెరవేర్చలేదని, అందువల్లనే మళ్లీ యానాంలో దీక్షకు దిగాల్సి వచ్చిందని అన్నారు. యానాం గత 25 ఏళ్లుగా నిర్లక్ష్యానికి గురైందని, ఈ నేపథ్యంలోనే ఇక్కడి ప్రజలు తనను ఎమ్మెల్యేగా గెలిపించారని చెప్పారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీఎం రంగసామిని అనేక సార్లు కలిశానని.. ఆయన స్థాయిలో పూర్తయ్యే పనులు సైతం చేయకుండా నిలిపివేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. యానాం సమస్యలు, వరద నష్టాలు, ఆయుష్మాన్‌భవ ఆరోగ్య కార్డులు పని చేయకపోవడం, డంపింగ్ యార్డు ఇబ్బందులు, నిరుద్యోగ యువతకు ఉపాధి, మూత పడిన పరిశ్రమల వంటి సమస్యలున్నప్పటికీ పట్టించుకోకుండా.. యానాం ప్రజా ఉత్సవాలకు లక్షలాది రూపాయలు మంజూరు చేయడం.. ముగింపు వేడుకలకు సీఎం రావడాన్ని ఇక్కడి ప్రజలు ప్రశ్నిస్తున్నారని వివరించారు. సమస్యలు పరిష్కరించేంత వరకూ తన దీక్ష కొనసాగుతుందని ఎమ్మెల్యే అశోక్ స్పష్టం చేశారు. ఆయనకు మద్దతుగా నాయకులు పండు సిద్ధార్థకుమార్, కాటంశెట్టి రామ్మూర్తి, సబ్బతి లోకేశ్వరరావు, మాగాపు సుబ్బారావు, కాకి నాగేశ్వరరావు, ధూళిపూడి మధు తదితరులు దీక్షా శిబిరంలో కూర్చున్నారు. అంతకుముందు ఆయన వందలాది మందితో ర్యాలీగా దీక్షా శిబిరానికి చేరుకున్నారు.

ముగిసిన రుగ్వేద మహాసభలు

పి.గన్నవరం: శ్రీ అశ్వలాయన మహర్షి రుగ్వేద పరిషత్ ఆధ్వర్యాన ముంగండ చింతామణి గణపతి మందిరంలో మూడు రోజులుగా జరుగుతున్న సంపూర్ణ రుగ్వేద సంహిత పారాయణ, వేద విద్వత్ మహాసభలు శనివారం ముగిశాయి. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన రుగ్వేద పండితులు పాల్గొన్నారు. చివరి రోజు వేద పండితులను పరిషత్ అధ్యక్ష, కార్యదర్శులు గోదావరి వెంకట సుబ్బారావు, చెరుకూరి వెంకట సుబ్రహ్మణ్య ప్రసాద్, సహ కార్యదర్శి గంటి సుబ్రహ్మణ్యశాస్త్రి తదితరుల ఆధ్వర్యంలో సత్కరించారు.

టెన్నికాయిట్ క్రీడాకారులకు శిక్షణ

మండపేట: పూర్వపు ఉభయ గోదావరి జిల్లాలకు చెందిన టెన్నికాయిట్ క్రీడాకారుల శిక్షణ శుక్రవారం మండపేటలో ప్రారంభమైంది. గత ఏడాది నవంబర్‌లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో జరిగిన అండర్–14 టెన్నికాయిట్ పోటీల్లో ఉభయ గోదావరి జిల్లాల నుంచి ఐదుగురు బాలురు, ఐదుగురు బాలికలు రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారు. వీరికి స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఐదు రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నట్టు మండపేట టెన్నికాయిట్ క్లబ్ ఆర్గనైజర్, కోచ్ కుంచె రమేష్ తెలిపారు. విశాఖపట్నంలో ఈ నెల 11, 12 తేదీల్లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారన్నారు. రాష్ట్రస్థాయిలో ప్రతిభ చూపిన క్రీడాకారులు 21వ తేదీ నుంచి విశాఖపట్నంలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధిస్తారన్నారు. జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ ట్రెజరర్ కె.రామకృష్ణ, పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం ఎం.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ అడ్మిషన్లకు నేటితో గడువు పూర్తి

రాయవరం: ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యా పీఠం (ఓపెన్ స్కూల్ సొసైటీ) ఆధ్వర్యంలో నిర్వహించే అడ్మిషన్లకు శనివారంతో గడువు ముగియనుంది. ప్రస్తుత విద్యా సంవత్సరంలో పదో తరగతి, ఇంటర్మీడియెట్ కోర్సుల్లో అడ్మిషన్లకు తత్కాల్ ప్రాతిపదికన మరో అవకాశం ఇచ్చారు. గత ఏడాది ఆగస్టులో నోటిఫికేషన్ వెలువడగా, డిసెంబర్ 16తో గడువు ముగిసింది. అయితే ఇప్పటికే అడ్మిషన్ పొందలేని వారికి ఓపెన్ స్కూల్ డైరెక్టర్ కేవీ శ్రీనివాసులురెడ్డి మరో అవకాశం కల్పించారు. అలాగే అడ్మిషన్ ఫీజు చెల్లింపునకు 8వ తేదీ వరకూ గడువు ఇచ్చారు. పదో తరగతికి అపరాధ రుసుం రూ.400, ఇంటర్‌కు రూ.500 ఉంటుందన్నారు. అపరాధ రుసుంతో ఓపెన్ స్కూల్ ప్రవేశాలు ఈ నెల 8వ తేదీ వరకూ ఉన్న విషయాన్ని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్‌వీ రవిసాగర్ ధ్రువీకరించారు. వివరాలకు ఓపెన్ స్కూల్ సొసైటీ జిల్లా కో ఆర్డినేటర్ పి.సాయి వెంకట రమణను 8977 645 704 నంబరులో సంప్రదించాలని డీఈఓ సూచించారు.